క్లుప్తంగా

జయప్రదం చేయండి


సమావేశమైన ఏపీ భవన నిర్మాణ కార్మికులు

కర్నూలు(సెంట్రల్): గుంటూరులో జూలై 23, 24 తేదీల్లో జరిగే ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ ఖాజాపాషా, నగర ఉపాధ్యక్షుడు అబ్దుల్ దేశాయ్ పిలుపునిచ్చారు. మంగళవారం గడియారం ఆసుపత్రి ఎదుట అడ్డా కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర మహాసభలకు అధిక సంఖ్యలో కార్మికులు తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయుడికి డాక్టరేట్


డాక్టర్ టీవీఆర్ కిషోర్

కర్నూలు(అర్బన్): కర్నూలులోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న టీవీఆర్ కిషోర్‌కు రాయలసీమ విశ్వ విద్యాలయం డాక్టరేట్ (పీహెచ్‌డీ)ను అందించింది. డీఎల్ఎడ్ విద్యార్థి ఉపాధ్యాయుల నైతిక తీర్పు, వారి భావోద్వేగ పరిపక్వత, సామాజిక పరిపక్వతతో ఎలా అనుసంధానమై ఉంటుంది? అనే అంశంపై ఆయన అధ్యయనం చేశారు. ఈ పరిశోధనకు ప్రొఫెసర్ డాక్టర్ అక్తర్ పర్వీన్ మార్గదర్శకురాలిగా సేవలందించారు. విశ్వ విద్యాలయం ఈ పరిశోధనను పరిశీలించి శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉందని గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా డాక్టర్ కిశోర్ మాట్లాడుతూ తనకు డాక్టరేట్ వచ్చేందుకు సహకరించిన ప్రొఫెసర్ డాక్టర్ అక్తర్ పర్వీన్, ఆర్‌యూ ఆచార్యులు, సహచర అధ్యాపకులు, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త పింఛన్లు వెంటనే మంజూరు చేయాలి


మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా


కర్నూలు(సెంట్రల్): అర్హులైన వారికి వెంటనే కొత్త పింఛన్లు మంజూరుచేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా డిమాండ్ చేశారు. వారు సోమవారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి 13 నెలలు గడిచినా ఇప్పటివరకు ఒక్కటి కూడా కొత్త పింఛన్ మంజూరు చేయలేదన్నారు. ఫలితంగా అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రకాష్, విశ్వనాథ్, గోవర్ధన్, సాయి, కిరణ్, రఫీ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐయూఐ గుర్తింపును రద్దు చేయాలి


ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఒడిశాలో విద్యార్థినులపై ఎన్ఎస్‌యూఐ నాయకులు చేస్తున్న అఘాయిత్యాలను ఖండిస్తూ ఆ సంస్థ గుర్తింపును రద్దు చేయాలని ఏబీవీపీ కర్నూలు విభాగ కన్వీనర్ గేటు ఎర్రిస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఎస్‌యూఐ తీరుతో వర్సిటీల్లోని విద్యార్థినులు, ప్రొఫెసర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒడిశా విభాగం ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఉదిత్‌ప్రదాన్ శీతల పానీయాల్లో మత్తు మందు కలిపి ఇచ్చి ఓ విద్యార్థినిపై అఘాయిత్యం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. నంద్యాల జిల్లా కన్వీనర్ యుగంధర్, నాయకులు లోకేష్, పవన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువ పరిశీలన


కృష్ణగిరి వద్ద హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న ఎస్ఈ పాండురంగయ్య

కృష్ణగిరి: హంద్రీనీవా కాలువ ద్వారా నీరు నిరంతరాయంగా వెళ్లుతుందని హెచ్ఎన్ఎస్ ఎస్ఈ పాండురంగయ్య తెలిపారు. మంగళవారం ఆయన మల్లెపల్లె, కృష్ణగిరి, కంబాలపాడు, ఆలంకొండ, గుండ్లకొండ ఎత్తిపోతల పథకాలను పరిశీలించారు. అలాగే కృష్ణగిరి, పందికోన రిజర్వాయర్లకు కూడా నీటిని వదిలినట్లు తెలిపారు. ఎత్తిపోతల పథకాల వద్ద మోటార్లకు సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని. అలాగే కాలువ వెంట నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈయన వెంట డీఈ చెన్నయ్య ఉన్నారు.


సాయి రథోత్సవంలో భక్తులు, సేవకులు


నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

వైభవంగా సత్యసాయి రథోత్సవం

కర్నూలు కల్చరల్: సత్య సాయిబాబా అవతార శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం ప్రేమ ప్రవాహిని రథోత్సవం వైభవంగా జరిగింది. ఓల్డ్ సిటీ జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠం వద్ద ప్రారంభమైన రథోత్సవం నగరంలోని ప్రధాన కూడళ్ల గుండా సాగి గుత్తి రోడ్‌లోని సూర్య దేవాలయం వరకు చేరుకొని అక్కడి నుంచి రాగమయూరి కాలనీ, గోశాల మీదుగా వెల్దుర్తి చేరుకుంది. మహిళలు కలశాలతో రథానికి స్వాగతం పలికారు. రథం ముందు చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. విశ్వ శాంతి కోసం తలపెట్టిన కార్యక్రమంలో భాగంగా రథయాత్ర చేపట్టడం జరిగిందని సేవా సంస్థల అధ్యక్షుడు కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సేవా సంస్థల అధ్యక్షుడు సాయిబాబా, కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, బాలవికాస్ బాలబాలికలు, గురువులు, సేవాదళ్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


శ్రీ సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథం


రథానికి హారతి ఇస్తున్న భక్తులు


రథానికి స్వాగతం పలుకుతున్న మహిళలు

ఈగల్ టీమ్ కార్యకలాపాలపై అవగాహన


విద్యార్థులతో కలసి 'డ్రగ్స్ వద్దు బ్రో' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఈగల్ టీమ్

కర్నూలు: నగర శివారులోని కోడుమూరు రోడ్డులో ఉన్న సెయింట్ క్లారెట్ పాఠశాలలో మంగళవారం ఈగల్ టీమ్ కార్యకలాపాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈగల్ టీమ్ కార్యకలాపాలు, ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972 గురించి వివరించారు. అలాగే స్కూల్ ప్రాంగణంలో పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. 'డ్రగ్స్ వద్దు బ్రో' నినాదాన్ని విద్యార్థులందరి చేత ప్లకార్డుల ప్రదర్శన చేయించారు. విద్యార్థుల్లో మాదక ద్రవ్యాలపై అవగాహన పెంచడం, బాధ్యతాయుతంగా వ్యవహరించేందుకు ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఈగల్ టీమ్ అధికారులు వెల్లడించారు.

మహిళలపై వేధింపులను నిరోధించాలి


ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజకు వినతిపత్రం ఇస్తున్న ఐద్వా మహిళలు

కర్నూలు(సెంట్రల): రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, అకృత్యాల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల, ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చిన ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజకు ఐద్వా మహిళలు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. రోజురోజుకు మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. నందికొట్కూరు మండలం మల్యాలలో 8 ఏళ్ల బాలిక కనిపించకుండా పోయినా ఇంతవరకు ఆచూకీ కనిపెట్టడంలో పోలీసులు విఫలమయ్యారని, ఆదోనిలో భూవివాదంలో దళిత మహిళను హత్య చేసినా అడిగే నాథుడే లేరని వాపోయారు. జిల్లాలో రోజురోజుకు మహిళలపై దాడులు పెరిగిపోతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో కూడా మహిళలపై దాడులు పెరిగిపోతుండడంతో నిత్యం భయాందోళనతో జీవించాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో అరుణమ్మ, సుజాత పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా నిలుస్తాం


సంఘీభావం తెలుపుతున్న డీఈఎఫ్ నాయకులు

కర్నూలు (సెంట్రల్): దివ్యాంగులకు అండగా నిలవడమే తమ ధ్యేయమని డీఈఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, సెక్రెడ్ సంస్థ డైరెక్టర్ తిప్పన్న, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు నాగరాజు గౌడ్, దివ్యాంగుల ఎంప్లాయిస్ యూనియన్ సెక్రటరీ కృష్ణుడు, నీలా జోజిబాబు అన్నారు. మంగళవారం కర్నూలు పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో డీఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బీసీ నాగరాజు ఆధ్వర్యంలో దివ్యాంగుల సాధికారత ఫోరం (డీఈఎఫ్) ఆవిర్భావ దినోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ.. దివ్యాంగుల సాధికారత కోసం సహాయ, సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2016-వికలాంగుల హక్కుల చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల హక్కులు, రాయితీ, రిజర్వేషన్ల కోసం పోరాటాలు చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో గ్రామస్థాయి నుంచి డీఈఎఫ్‌ను బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

కేవీఆర్‌తో విడదీయరాని బంధం


మాట్లాడుతున్న ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయాధికారి జి.లాలెప్ప

కర్నూలు (సిటీ): కేవీఆర్ కళాశాలతో తనకు విడదీయరాని బంధం ఉందని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారిగా బాధ్యతలు చేపట్టిన జి.లాలెప్ప అన్నారు. కేవీఆర్ ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఇంటర్ బోర్డు ప్రాంతీయ అధికారిగా నియమితులైన లాలెప్పకు మంగళవారం ఆ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రభుచరణ్ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా వృత్తి విద్యాధికారి డాక్టర్ సురేష్‌కుమార్ హాజరయ్యారు. విశ్రాంత ప్రిన్సిపాల్ కొట్టే చిన్నయ్య విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ముఖ్య అతిథి సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. కళాశాల అస్తిత్వం కాపాడటానికి లాలప్ప ఎంతో కృషి చేశారని, ఆయన కృషితోనే కళాశాలకు సొంత భవనాలు ఏర్పడ్డాయని కొనియాడారు. అనంతరం లాలెప్ప మాట్లాడుతూ.. దాదాపు 12 ఏళ్ల నుంచి ఇదే కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నానని, కేవీఆర్‌తో విడదీయరాని బంధం ఉందన్నారు. కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం ఆయన్ను ఘనంగా సన్మానించారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎండీ అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 7న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి భీమేష్ స్పష్టం చేశారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో చలో విజయవాడకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, 2022 నుంచి అరియర్స్ చెల్లించాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అన్‌స్కిల్డ్ కార్మికులకు ఐటీఐ విద్యార్హతగా నిర్ణయించి ఆపరేటర్‌తో సమానంగా వేతనం ఇవ్వాలన్నారు. మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాగన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.

టిడ్కో గృహాల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు (టౌన్): టిడ్కో కాలనీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం స్థానిక జగన్నాథ గట్టుపై ఉన్న టిడ్కో గృహాలను పరిశీలించి నివాసితులతో మాట్లాడారు. స్థానికులు కమిషనర్‌ను కలిసి విద్యుత్ దీపాలు, రేషన్ దుకాణం,బస్సు సౌకర్యం, పోలీసు ఔట్ పోస్టు, ప్రాథమిక పాఠశాల, సచివాలయం, అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేయాలని విన్నవించారు. స్పందించిన కమిషనర్ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, టిడ్కో ఈఈ సూర్యనారాయణ, డీఈఈ రవి గుప్త, స్పెషలిస్ట్ అధికారి పెంచలయ్య, మధు, ఏఈ ప్రవీణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

26న సర్వసభ్య సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు అర్బన్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సర్వసభ్య సమావేశం ఈ నెల 26న నిర్వహించనున్నట్లు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ చైర్మన్ టి.నాగరమణయ్య తెలిపారు. ఈ సొసైటీలో జరిగిన అక్రమాలపై ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ చట్టం సెక్షన్-51 ప్రకారం విచారణ నిర్వహించగా రూ.2.42 కోట్ల మేర నిధులు స్వాహా అయినట్లు తేలింది. నిధుల దుర్వినియోగానికి పాలకవర్గమే కారణమని విచారణలో నిర్ధారణ అయ్యింది. విచారణకు సంబంధించిన నివేదిక సొసైటీకి ముట్టిన 30 రోజుల్లో సర్వసభ్య సమావేశం నిర్వహించి ఆమోదం తీసుకోవాల్సి ఉందని, ఇందులో భాగంగా ఈ నెల 26న ఈ సమావేశం సొసైటీ కార్యాలయంలోనే ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విచారణలో వెలుగు చూసిన అక్రమాలను సభ్యులకు వివరించడం జరుగుతుందని తెలిపారు. సొసైటీలోని సభ్యులందరూ సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

25న ఫ్లోర్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లాస్థాయి ఫ్లోర్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఫ్లోర్ బాల్ సంఘం కార్యదర్శి ఈశ్వర్ నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, అండర్-19 బాలబాలికల విభాగంలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులు వచ్చే నెల 3 నుంచి పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరగనున్న 19వ రాష్ట్రస్థాయి ఫ్లోర్ బాల్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు 70138 86343 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యత

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ చెప్పారు. మంగళవారం సాయంత్రం ఆమె కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించి బాధిత మహిళలతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకుని అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిళలను ఆదుకోవడంలో భాగంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో సఖి వన్‌స్టాప్ సెంటర్లను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కేంద్రాల్లో మహిళ అధికారులు మాత్రమే ఉంటారని, మహిళలకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా ఈ సెంటర్ ద్వారా చట్టపరంగా సాయం అందించడంతో పాటు కొన్ని రోజుల పాటు ఆశ్రయం కూడా అందిస్తామన్నారు. మహిళా పోలీస్‌స్టేషన్‌తో సమన్వయం చేసుకుని మహిళలకు రక్షణ కల్పిస్తున్నామన్నారు. ఐసీడీఎస్ పీడీ నిర్మల, వన్‌స్టాప్ సెంటర్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

24న చౌడేశ్వరీ దేవి ఆవిర్భావ దినోత్సవం

కర్నూలు కల్చరల్: సప్తగిరి మణికంఠ అయ్యప్ప స్వామి దేవాలయంలో ఈనెల 24వ తేదీ చౌడేశ్వరీ మాత ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆ రోజున ఉదయం 10 గంటలకు పంచామృతాభిషేకం, జ్యోతి ఉత్సవం, లలితా సహస్రనామ సహిత కుంకుమార్చన, సారె సమర్పణ, తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

తైక్వాండోలో రాణించాలి


క్రీడాకారులను అభినందిస్తున్న మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ శమంతకమణి

కర్నూలు (టౌన్): విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఈనెల 24 నుంచి నిర్వహించనున్న జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటాలని మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ శమంతకమణి అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక నరసింహారెడ్డి నగర్‌లోని తన స్వగృహంలో జాతీయ పోటీల్లో పాల్గొంటున్న శ్రీ లలిత, భార్గవ్, మల్లికార్జున, విశ్వాసరావు, తిలక్ అఖిల్, సాయిక్రిష్ణ, హరిక్రిష్ణ, మనీష్‌లను ఆమె అభినందించారు. ఆమె మాట్లాడుతూ.. తైక్వాండో పోటీలకు తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. జాతీయ క్రీడలను అవకాశంగా తీసుకొని రాణించాలన్నారు. తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి అజయ్, టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పైప్‌లైన్ మరమ్మతులు పూర్తి చేయండి


మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): సంతోష్ నగర్ జాతీయ రహదారిపై లీకైన 1200 ఎం.ఎం. డయా పైప్‌లైన్ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి లీకేజీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మునగాలపాడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి అశోక్ నగర్ నీటి శుద్ధి కేంద్రానికి నీటిని సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పనుల వల్ల బుధ, గురువారం రెండు రోజులపాటు నగరంలో మంచినీటి సరఫరా నిలిపివేసినట్లు చెప్పారు. ప్రజలు గమనించి సహకరించాలన్నారు.

కల్లూరు ప్రాంతానికి హంద్రీ నీళ్లు

అబ్బాస్ నగర్‌లోని 3 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంటు ప్లాంటు సమీపంలో ఉన్న కల్లూరు వార్డులకు తాగునీటిని మరింత మెరుగ్గా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. హంద్రీ నది నీటిని టిడ్కో వద్ద ఉన్న ప్రెషర్ ఫిల్టర్ ద్వారా అబ్బాస్ నగర్ ట్రీట్‌మెంటు ప్లాంటుకు పంపింగ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీని వల్ల పరిసర వార్డుల్లో ఉన్న 30 వేల మందికి నీటిని అందించేందుకుదోహదపడుతుందన్నారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, డీఈఈలు మనోహర్ రెడ్డి, నరేష్, ఏఈలు జనార్దన్, ప్రవీణ్ పాల్గొన్నారు..

వాటర్ వర్క్స్ ముఖ్య ఇంజినీరు ఏక్కడ?

6 లక్షల మంది ప్రజలకు నీటిని అందించే పైపులైన్ మరమ్మతుల కారణంగా కర్నూలు నగరానికి రెండు రోజుల పాటు మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. అయితే పైపులైన్ పనులను పర్యవేక్షించాల్సిన ముఖ్య ఇంజనీరు ఎక్కడున్నారు? పనుల వద్ద పర్యవేక్షణ చేసి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాల్సిన సదరు అధికారి తనకు సంబంధం లేనట్లు వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ నెల 16వ తేదీ ఆరోగ్యం బాగా లేదని వైద్యుడిని సంప్రదిస్తే బీపీ 170 ఉందని చెప్పాడని పేర్కొంటున్న సదరు అధికారి సెలవులో మాత్రం లేడు. రోజూ విధులకు వస్తున్నారు. అనారోగ్యం ఉంటే సెలవు పెట్టి విశ్రాంతి తీసుకోవచ్చు కదా? అని తోటి ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఫైళ్ల ఇతరాత్ర పనులు మాత్రం చక్కబెడుతున్నారు. తప్పా.. వాటర్ వర్క్స్ ఇన్‌చార్జ్‌గా ఉన్న సదరు అధికారి పర్యవేక్షణ చేయాల్సిన పనులపై అంటీఅంటనట్లుగా ఉన్నారు. కమిషనర్ ఒక్కరే వాటర్ వర్క్స్‌లోని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు గిరిరాజు, మనోహర్ రెడ్డి, నరేష్‌లతో కలిసి పనులు చేయిస్తున్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కర్నూలు(రూరల్): నగర సమీపంలోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. కుంకుమార్చన, ఆకుపూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

లాడ్జిలో వ్యక్తి ఆత్మహత్య

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): నగరంలోని కోటిపల్లి బస్టాండ్ వద్దనున్న ఓ లాడ్జిలో మంగళవారం వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కర్నూలుకు చెందిన మహమ్మద్ ఫరూక్ (31) సోమవారం రాజమహేంద్రవరం వచ్చి లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నాడు. మర్నాడు ఉదయం 11 గంటలకు గడువు అయిపోవడంతో లాడ్జి సిబ్బంది తలుపు కొట్టగా, అతడు ఎంతకూ తెరవలేదు. అనుమానం వచ్చిన సిబ్బంది మారు తాళం చెవితో తలుపు తీయగా, ఫరూక్ విగత జీవిగా పడిఉన్నాడు. ఈ విషయమై లాడ్జి నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించగా గదిలో పురుగు మందు డబ్బా లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసు నమోదు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరం జొహరాపురానికి చెందిన వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. రవిసాయి అనే వ్యక్తి ఎనిమిదో తరగతి చదువుచున్న ఓ బాలిక వెంటపడుతూ లైంగికంగా వేధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తుండటంతో బాధితురాలి తల్లి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

నగరపాలక ఈఈగా మనోహర్ రెడ్డి

కర్నూలు (టౌన్): ప్రజా సాంకేతిక శాఖ ఇంజినీరింగ్ విభాగంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పనిచేస్తున్న పలువురికి రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. డీఈఈలకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పదోన్నతి కల్పిస్తూ మంగళవారం రాత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ జీఓ 697 ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగానే నగరపాలక సంస్థలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న జి.మనోహర్ రెడ్డికి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పదోన్నతి కల్పిస్తూ కర్నూలు కార్పొరేషన్‌లోనే నియమించారు. ఇక్కడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న పి.లీలా క్రిష్ణప్రసాద్‌ను విజయవాడ టిడ్కోకు డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. అలాగే కుడా (కర్నూలు అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ)లో పనిచేస్తున్న బి.గోపాల క్రిష్ణమూర్తిని ఆదోని మున్సిపాలిటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా, అలాగే కుడాలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నయాబ్ రసూల్‌ను కూడాలో ఖాళీగా ఉన్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా నియమించారు.

మహాప్రస్థానం సేవలపై అసంతృప్తి


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నిర్వహిస్తున్న మహాప్రస్థానం వాహన సేవలపై సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం తన చాంబర్‌లో మహాప్రస్థానం, సప్తవర్ణ దుప్పట్ల సేవలు (లెనిన్ క్లాత్)పై సమీక్ష సమావేశం నిర్వహించారు. మహాప్రస్థానం సేవలకు సంబంధించి సిబ్బందితో ఆరా తీశారు. వారి వద్ద ఉన్న డెత్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆసుపత్రిలో చనిపోయిన వారిని ఏ విధంగా తరలిస్తున్నారో అడిగి తెలుసుకుని వారి సేవలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మహాప్రస్థానం డ్యూటీ డ్రైవర్లు స్పందించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రిలోని పలు విభాగాల్లో రోగులకు స్వచ్ఛ సప్తవర్ణ దుప్పట్ల సేవలపై ఆరా తీశారు. రోజుకొక కలర్ చొప్పున దుప్పట్లు వినియోగించాలని, ఆ మేరకు చేస్తున్నారా అని ఆరా తీశారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, ఇన్‌చార్జ్ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్ మృతి తీరని లోటు


అచ్యుతానందన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కేరళ మాజీ సీఎం వీఎస్ అచ్యుతానందన్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పేర్కొన్నారు. మంగళవారం హరికిషన్ సుర్జీత్ సింగ్ కార్యాలయంలో వీఎస్ అచ్యుతానందన్ మృతికి సీపీఎం సంతాపం ప్రకటించింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేరళలో అత్యంత ప్రజాదరణ ఉన్న నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. అచ్యుతానందన్ అలుపెరగని పోరాట యోధుడని, ఆయన 1967 నుంచి 2016 వరకు కేరళ అసెంబ్లీకి ఎన్నికై మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు. ఆయన మృతికి సీపీఐ జిల్లా సమితి తరఫున సంతాపం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. నాయకులు ఖాజాపాషా, ఎస్ఎండీ షరీఫ్, అబ్దుల్‌దేశాయ్ పాల్గొన్నారు.